# ఎ ఏ ఐ ఒ ఓ ఔ

శ్రీ శ్రీ

## ఎ

ఎక్కడ ఎప్పుడు
ఎవరైనా చెప్పాడు ఈ చిక్కు విప్పాడు
ఆరంభం ఎక్కడ
అంతం ఎప్పుడు
ఎందుకీ నొప్పులు ఏమిటీ చప్పుడు

లక్షలు లక్షలు
యక్షప్రశ్నలు అన్నీ తప్పులు
ఏచోట జననం
ఏపూట మరణం
ఈలోపున ఎన్నెన్ని పడరాని తిప్పలు

కంట్లో కారం
ఒంట్లో క్షారం గుండెల్లో దాహం
ఉచ్ఛ్వాసం నిశ్వాసం
ఒకే అనుప్రాసం
సందేహం పన్నుతుంది సరోరుహవ్యూహం

ఆగమనం నిష్క్రమణం
అంతా ఒక చంక్రమణం ఆలోచించు బాగా
ఏదైతే సవాలు
అదేలే జవాబు
ఒమేగా ఆల్ఫా, ఆల్ఫా ఒమేగా

శాస్త్రం నీ అస్త్రం
మౌనం శ్మశానం అది కాదు జ్ఞానం
పరీక్షించు సహేతుకంగా
ప్రసంగించు సాధికారంగా
సృష్టిసూత్రం మాత్రం సరైన విధానం

ఏమిటీ చప్పుడో
ఎందుకీ నొప్పులో అంతం ఎక్కడో
ఆనందం ఎప్పుడో
ఆ చిక్కు విప్పడు
ఎక్కడా ఎప్పుడూ ఎవ్వడూ చెప్పడు

## ఏ

ఏదైనా గీతం
చేదైనా మైమరపిం
చేదైనా మది కదిలిం
చేదైనా ఎదరగిలిం
చేదైనా ఏదైనా
నేదైనా
రేపైనా
ఏమైనా గానం

జడి జడిగా వర్షం నా
మెడమీదా
తొడమీదా
తడితడిగా రక్తం నా
గదిలోనూ
హృదిలోనూ
దడదడగా కంపం నా
నడినెత్తిని రంపం

నాకోసం ఆకాశం
చేకూర్చే ఆవేశం
రేగించే ఉద్రేకం
ఊగించే ఉద్వేగం
దావానల హాలాహల
కీలోజ్జ్వల కోటీరం
నీలోత్పల కాసారం
నీలోపల కేయూరం

కనిపించక జడిపించే
కిసురించే సకిలించే
కిటికీలో రూపం నా
కిటికీ ముంగిటి ధూపం
గాలంవలె శూలంవలె
వేలాడే కాలం
వేటాడే వ్యాఘ్రం అది
వెంటాడును శీఘ్రం

కాలానికి భయపడితే
కలిగేదే శోకం
కదిలేనా లోకం
దొరికేదా నాకం
కనుపాపలు తెరచాపలు
ప్రళయంలో పయనం
నిరయంలో శయనం
విలయంలో విజయం

## ఐ

ఐక్యం అదీ మనకి ముఖ్యం
అందులోనే ఉంది సౌఖ్యం
లేనిపోని చీలికలు
రెండురెండు నాలికలు
ఛీ యిదా బతుక్కి
ఫాయిదా

ఐక్యం అదీ వ్యవస్థ
అప్పుడుండదు మనకీ అవస్థ
కాదు ఔను అవును
కాదు కాదు అవదు
అనేకం అయితే ఏకం
అదే వివేకం

ఐక్యం అన్నింటికీ మూలం
అటే కదుల్తోంది కాలం
పురోగతి ప్రపంచ నీతి
మనదాకే మానవజాతి
వ్యక్తికి బహువచనం
శక్తి

ఐక్యం అదే మనకి గమ్యం
అప్పుడే సిద్ధిస్తుంది సామ్యం
వ్యర్థం స్పర్థంటూ
యుద్ధం వద్దంటూ
కామ్యం ఐక్యం అయిన బతుకే
రమ్యం

ఐక్యం ఎప్పుడో కాదిప్పుడే
ఎక్కడో కాదు అదిక్కడే
మాట చేతగా మారి
మనిషి మనిషితో చేరి

స్వప్నం సత్యం ఐతేనే
స్వర్గం

## ఒ

ఒకానొక అనగా అనగాల వేళ
(అది కృతయుగం
కాదు మృతయుగం)
అదే మన కథలకీ కవిత్వాలకీ డోల

మనుష్యుని బాల్యంలోని అమాయకత్వం
(ప్రార్థించే మొక్కలూ
మాట్లాడే నక్కలూ)
కళలో జీవితంలో నిదర్శించే అరణ్య తత్వం

సామూహికం స్వాతంత్ర్యం అన్వేషించుఆగత్యం
(ఒంటరితనం
తుంటరితనం)
సామాజికంగా పెరుగుతుంది స్వేచ్ఛ ఇది సత్యం

అజ్ఞానం చీకటి భయానికీ క్రౌర్యానికీ కాణాచి
(శిశుత్వం అదే
పశుత్వం అదే)
చంపడానికి సరదా అమ్మయ్యో బూచి

మార్చాలంటూ ఇదంతా ప్రసరించాలి కాంతి
(శాస్త్రం కళని చంపబోదు
జనాన్ని భయంతో నింపలేదు)
మానవాళికి పరిణామం కానుక పావురంలాంటి
శాంతి

## ఓ

ఓహో విహంగమా
ఎగురు
ఎగురు
నీ రెక్కల విసురులో మన్వంతరాలు
తరలు
తరలు

ఓహో తరంగమా
కదలు
కదలు
నీ ముంచెత్తు వరదలో నిమ్నోన్నతాలు

కరగు
కరగు
ఓహో మృదంగమా
పలుకు
పలుకు
నీవిచ్చు హెచ్చరికలో నిరాశాదురాశాభాండాలు
పగులు
పగులు
ఓహో జనాంగమా
నడువు
నడువు
నీ పరాంకోటి హస్తాలతో నూతన గవాక్షాలు
తెరువు
తెరువు

## ౩

ఔను వాహనం మారింది: దూరానికి పూర్వపు అర్థం పోయింది
పూర్వం దూరం పోయింది వెనకటి వాహనం మారింది
ఆ సూర్యుడే నేడూ
ఆ చంద్రుడీనాడూ
అవే నక్షత్రాలూ-ఐనా కాలం మారింది
ఔనా కాలం మారింది మరి: మానవుడా మేలుకో నేస్తం
ఎద్దుబండితో కొలవకు దూరాన్ని ఎగరవోయ్ చదలయెద చీలుస్తూ
రేపు బయల్దేరా లనుకున్నావు
నేడే ఇచ్చటికి వచ్చేశావు
విచ్చేసింది నీ తరుణం పుచ్చుకో ఇది నీ భావి
ఇది నీ భావి గ్రహించు: ఈ భావి నీకు నా ప్రెజెంటు
భూతకాలపు సరీసృపాలని పాతరాతి యుగంలో పారెయ్
పాతెయ్ నీ సందేహాలని
తోలెయ్ నీ మందాక్షాలని
నిటారుగా నిలబడు నేస్తం హుటాహుటిగా ముందుకిసాగు
హుషారుగా ముందుకిసాగు: ఊరికే వెనక్కి చూస్తావేం
దుప్పివీ కుక్కవీ కావు తిర్యగ్దృక్కువి నువ్వు కావు
దూరం కరిగిపోతోంది
కాలం మరిగిపోతోంది
మానవుడిగా మేలుకో నేస్తం ఏలుకో ఈ విశ్వం సమస్తం

(సామ్యవాద మహాభారతం: ఆనుశాసనికం)


## కావలెను

ఇప్పుడు చక్కని మూడు మోడల్సులో లభ్యం అవుతున్న "లాయల్"
ఫౌంటెన్ పెన్నులు విక్రయించుటకు ఏజెంటులూ, స్టాకిస్టులూ కావలెను.

**అకర్షణీయమైన షరతులు.**

సాంపిల్సుకు, షరతుల ఉచిత వివరాలకు

ఈ క్రింది చిరునామాకు వ్రాయండి :

**KAMDAR'S (Madras) LIMITED,**
**23, Errabalu Chetty Street,**
**MADRAS-1.**

ఫోన్ : 2418.

(ప. రా. ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో వ్రాయవలెను.)